క్లుప్తంగా

సబ్సిడీ రుణాలతో ఆర్థికంగా ఎదగాలి


డ్రా తీస్తున్న చైర్‌పర్సన్ సుజాత

మెట్‌పల్లి: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలతో వ్యాపారం ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలని చైర్‌పర్సన్ రాణవేని సుజాత సూచించారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మైనార్టీ రుణాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డ్రా తీసి 13 యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బోయిన్‌పల్లి చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఆర్‌ఐ అక్షయ్, కౌన్సిలర్లు అంగడి పురుషోత్తం, యామ రాజయ్య, ఒజ్జెల బుచ్చిరెడ్డి ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం


శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కోరుట్లరూరల్: మండలంలోని చిన్న మెట్‌పల్లిలో కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులు గ్రామ శివారులోని వైకుంఠధమంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లికార్జున్, సర్పంచ్ నూతిపెల్లి గంగు, ఎంపీటీసీ పంచిరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక


లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణంలో మైనార్టీలకు నాలుగు అదనపు యూనిట్లు మంజూరయ్యాయి. కాగా మంగళవారం వైశ్యసంఘం భవనంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు ఆధ్వర్యంలో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్ తెలిపారు. వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు కన్నక మహేందర్, తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేశ్‌గౌడ్, మేనేజర్ వెంకట్ పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేక మహోత్సవం


ఆలయంలో అంజన్న దీక్షాపరులు

కోరుట్ల: పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేక మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు జంగం అనిల్, శ్రీపాద శ్రీకాంత్, బెజ్జారపు రంజిత్, తెడ్డు గంగారాం, విజయ్ పాల్గొన్నారు.

కంటివెలుగు ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో నీరజ

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూరు, సర్పరాజ్‌పూర్ గ్రామాల్లో మంగళవారం కంటి వెలుగు శిబిరాలు ప్రారంభమయ్యాయి. కల్లూరులో శిబిరాన్ని ఎంపీడీవో నీరజ ప్రారంభించారు. సర్పంచులు వనతడుపుల అంజయ్య, దానవేని సాయమ్మ, ఎంపీటీసీ చిట్నేని లత-రమేశ్, ఉపసర్పంచ్‌లు సతీశ్, రాకేశ్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు నత్తి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వరిలో మెడవిరుపు తెగులు

మల్యాల: మండలంలోని మల్యాల, ముత్యంపేట గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారి కారుణ్యకుమార్ మంగళవారం వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వరిలో మెడ విరుపు తెగులు సోకుతోందని గమనించినట్లు ఆయన తెలిపారు.

తడి, పొడి చెత్త నిర్వహణపై నిర్లక్ష్యం

- రాయికల్‌లో ప్రతిరోజూ 10టన్నుల వరకు చెత్త సేకరణ
- వేరు చేయడంలో కొరవడిన నిర్వహణ
- దుర్వాసన భరించలేకపోతున్నం: పట్టణ ప్రజలు


ఒకేచోట కుప్పగా ఉన్న తడి, పొడి చెత్త

రాయికల్: రాయికల్ మున్సిపల్‌లో చెత్త నిర్వహణ కొరవడింది. పట్టణంలో వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేయాల్సి ఉండగా మున్సిపల్‌లో అమలుకు నోచుకోవడం లేదు. పట్టణం పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నా పరిస్థితుల్లో మార్పులు రావడం లేదు. రాయికల్‌లో 12 వార్డుల్లో 4680 ఇళ్లు ఉండగా, చెత్త సేకరణ కోసం 6 ఆటోల్లో ప్రతిరోజూ 10 టన్నుల వరకు చెత్త సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కానీ తడి, పొడి చెత్తను వేరు చేయడంలో అధికారులు, పారిశుధ్య సిబ్బంది విఫలమవుతున్నారని పట్టణ ప్రజలు అంటున్నారు.

కంపోస్ట్ షెడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు

చెత్త సేకరణ విషయంలో కూడా మున్సిపల్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తడి, పొడి చెత్తను వేసేందుకుగాను ఒక్కో ఇంటికి రెండు బుట్టలు పంపిణీ చేశారు. అయినప్పటికీ తడి, పొడి చెత్త వేరు చేసే విషయంలో గృహ యజమానులు కూడా సహకరించకపోవడంతో తడి, పొడి చెత్త నిర్వహణ కొరవడింది. కంపోస్ట్ షెడ్డు నిర్మాణానికి రూ.10లక్షల మంజూరు అయ్యాయి. పట్టణంలోని ప్రతీ వార్డులో చెత్త సేకరణ కోసం వినియోగించే ఆటోలను కూడా తడి, పొడి చెత్త వేసేందుకు వేర్వేరుగా లేకపోవడంతో చెత్త అంతా ఒకేచోట వేయాల్సి వస్తోంది. సేకరించిన చెత్తను పట్టణ శివారులోని డంపింగ్‌యార్డులో కుప్పలు తెప్పలుగా పడేస్తున్నారు.

తడి, పొడి చెత్త ఒకేచోట..

తడి చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకునేందుకు వీలుండగా ప్రస్తుతం తడి, పొడి చెత్త ఒకే చోట వేయడంతో సేంద్రియ ఎరువు తయారీకి నోచుకోవడం లేదు. డంపింగ్‌యార్డు సైతం నిర్మాణం పూర్తికాకపోవడంతో ఖాళీ స్థలంలో వ్యర్థాలను కుప్పలుగా వేయడంతో ఆ వ్యర్థాల వద్దకు వచ్చి కుక్కలు స్వైర విహారం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి తడి, పొడి చెత్తను వేరుచేసి తడి చెత్తను సేంద్రియ ఎరువుకు ఉపయోగపడేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన వస్తోంది



రాయికల్ పట్టణంలోని ఇటిక్యాల క్రాసింగ్‌రోడ్ వద్ద ఉన్న డంపింగ్‌యార్డు నుంచి తడి, పొడి చెత్త వేరు చేయకపోవడంతో మున్సిపల్ సిబ్బంది కాల్చివేసే సమయంలో దుర్వాసన వస్తోంది. దీంతో ఒడ్డెరకాలనీవాసులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
– కల్లెడ సునీత, 8వ వార్డు కౌన్సిలర్

చెత్త వేరువేరుగా సేకరిస్తాం



రాయికల్‌లో తడి, పొడి చెత్త నిర్వహణ కోసం డీఆర్‌సీసీ కింద రూ.10లక్షలు మంజూరయ్యాయి. త్వరలోనే తడి, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేస్తాం. అంతేకాకుండా ఆటోల్లో కూడా తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరిస్తాం. దీని కోసం కూడా చర్యలు చేపడుతున్నాం.
– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

అటెన్షన్ ప్లీజ్



మా ఊరికి తారురోడ్డు వేయండి సారూ..

సారంగాపూర్: మండలంలోని ఒడ్డెరకాలనీ గ్రామానికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. ఆర్‌అండ్‌బీ తారురోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు ఎస్సారెస్పీ డి-53, 11ఆర్ కాలువ వెంట 2 కిలోమీటర్ల మేర గతంలో మట్టిరోడ్డు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో బురద, వేసవి కాలంలో దుమ్ముతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. తారురోడ్డుగా మార్చాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తారు రోడ్డుగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : భూపతి, పంచాయతీరాజ్ ఏఈ, సారంగాపూర్
ఫోన్ నంబర్: 91211 35727

కార్యకర్తలు పార్టీ కోసం పనిచేయాలి


డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రజలంతా సీఎం కేసీఆర్ వెన్నంటే ఉన్నారని, కార్యకర్తలు నాయకులు కష్టించి పనిచేస్తే మూడోసారి అధికారం ఖాయమని ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 1, 2, 14, 15, 16, 17వ వార్డుల బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జగిత్యాల ఎస్‌వీఎల్‌ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకుముందు జగిత్యాల అన్నపూర్ణ చౌరస్తా నుంచి ఎస్‌వీఎల్‌ఆర్ గార్డెన్స్ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ జగిత్యాల ముఖచిత్రాన్ని మార్చిన ఘనత ఎమ్మెల్యేదేనన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు కూసరి అనిల్, తోట మల్లికార్జున్, బద్దం లత, సిరికొండ పద్మ, సమ్మిల్ల వాణి పాల్గొన్నారు.

'మీరు నేను' ద్వారా ప్రజలకు మరింత చేరువ

సారంగాపూర్: మీరు నేను కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే రేచపల్లి, మ్యాడారం తండా, లచ్చునాయక్‌తండా, భీంరెడ్డిగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. కాగా సోమవారం రాత్రి రేచపల్లి గ్రామంలో పల్లె నిద్ర చేసిన ఎమ్మెల్యే మంగళవారం ఉదయం 6గంటల నుంచే గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడి అధికారులతో చర్చించి పరిష్కరించారు. కాగా నాలుగు గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల నిధుల వివరాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసిన నిధుల వివరాలను ఎమ్మెల్యే వివరించారు. అనంతరం తలుపులతండాకు రూ.68లక్షలతో నిర్మించే వంతెనకు, రేచపల్లిలో సారంగాపూర్ సహకార సంఘం రూ.24 లక్షలతో నిర్మిస్తున్న గోదాముకు, ఆయా గ్రామాల్లో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్లకు భూమిపూజ చేశారు. ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, విండో చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు ఎడమల జయ, భూక్య అరుణ్, మైనవేని బుచ్చిమల్లు, అజ్మీరా శ్రీలత, గుర్రాల రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు భూక్య లావణ్యారాథోడ్, జోగినపల్లి సుధాకర్‌రావు, ఉపసర్పంచ్ రాచకొండ రాజేశం పాల్గొన్నారు.

'ప్రాణమున్నంత వరకూ ప్రజల వెంటే'


మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

కోరుట్ల,కోరుట్లరూరల్: తన ప్రాణం ఉన్నంత వరకూ నియోజక వర్గ ప్రజల వెంటే ఉంటానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు పట్టణ శివారులోని కావేరి గార్డెన్స్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నంది చౌరస్తా నుంచి కావేరి గార్డెన్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాబోయే రెండు, మూడేళ్లలో నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకుంటా చూసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. రాష్ట్ర బీఆర్‌ఎస్ నేత డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళలకు, రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, వైస్ ఎంపీపీ చీటి స్వరూపారాణి, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు పిడుగు రాధ-సందయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు గడికొప్పుల మాధురి-గోపాల్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ పరిశీలన

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్ , దారిశెట్టి రాజేశ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

మెట్‌పల్లి: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని కోరుతూ పట్టణంలోని జర్నలిస్టులు మంగళవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళిత జర్నలిస్టులకు దళితబంధు అందజేయడంతో పాటు పట్టణంలో ప్రెస్‌భవన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆగ సురేశ్, భూరం సంజీవ్, మ్యాకల శివ, అజీమ్, మాసుల ప్రవీణ్, అలాల రాజేశ్ ఉన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

కోరుట్ల: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం కోరుట్లలో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బ్యాటరీ సైకిల్ ఎంపిక, కృత్రిమ అవయవాల కొలతల శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లికి పట్నాలు


ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో గౌడ సంఘం నాయకులు

రాయికల్: మండలంలోని వీరాపూర్ గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ పట్నాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పట్నాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రేవతి

రాయికల్: పట్టణంలోని 3, 6, 7 సెంటర్లలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా రక్తహీనతపై డాక్టర్ రేవతి అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు వనిత, రజిత, కౌన్సిలర్ కల్లెడ లావణ్య, అనురాధ పాల్గొన్నారు.

కొండగట్టు ఆలయంలో సౌకర్యాలు కల్పించాలి


వినతిపత్రం ఇస్తున్న సుగుణాకర్‌రావు

జగిత్యాలటౌన్: రాబోయే చిన్న, పెద్ద హనుమాన్ జయంతిని దృష్టిలో ఉంచుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కొండగట్టు ఆలయ పరిరక్షణ సమితి కన్వీనర్ పోల్సాని సుగుణాకర్‌రావు కోరారు. ఈ మేరకు మంగళవారం జగిత్యాల కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది తప్ప ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. రానున్న చిన్న, పెద్ద హనుమాన్ జయంతికి లక్షలాది మంది భక్తులు రానున్నందున వారికి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌కు అందించిన వినతిపత్రంలో కోరారు. ఆయన వెంట ఆలయ పరిరక్షణ సమితి కన్వీనర్ మోటకాడి మోహన్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్ లింగంపల్లి శంకర్, రాజయ్య, నటరాజ్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలు, విద్యార్థులు

మేడిపెల్లి: భీమారం మండలంలోని గోవిందారం గ్రామంలో మంగళవారం ప్రతిమ ఫౌండేషన్, కరీంనగర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 833 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. ప్రతిమ రేడియాలజీ హెడ్ వికాస్‌రావు, సర్పంచ్ మధుకర్, లక్ష్మీనర్సయ్య, ఎంపీటీసీ పూర్ణిమ, దశరథరెడ్డి, జలపతిరెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మ వాగు స్థలాన్ని పరిరక్షించాలి

రాయికల్: పట్టణంలోని రామాజీపేట రోడ్‌లోని బతుకమ్మ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణంలో ఆక్రమిత స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ మంగళవారం గ్రామ నాయకులు మోర సర్సయ్య, వంశీ, లక్ష్మణ్, వేణు ఆర్‌అండ్‌బీ ఈఈకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ వాగు పక్కనున్న స్థలాన్ని కబ్జా చేసి నిర్మిస్తున్నారని, కొత్తగా మంజూరైన బ్రిడ్జి మధ్యలో నిర్మించకుండా ఒక సైడ్‌కు మాత్రమే నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జాదారుల నుంచి బతుకమ్మ వాగు స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

చిరుధాన్యాల వినియోగంపై అవగాహన


పోషణ పక్వాడలో పాల్గొన్న మహిళలు

జగిత్యాలటౌన్: పోషణ పక్వాడలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ పీహెచ్‌సీలో రక్తహీనత నివారణ, చిరుధాన్యాలపై వినియోగంపై అవగాహన కల్పించారు. సీడీపీవో వీరలక్ష్మి, డాక్టర్ చేతన, వేణు, కోఆర్డినేటర్ మధుకుమార్, సూపర్‌వైజర్లు రాణి, స్వరూప పాల్గొన్నారు.

పోషణ పక్వాడ పక్షోత్సవాలు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఐసీడీఎస్ మల్యాల ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో నర్సింగరాణి, వైద్యులు నరేశ్, పరమేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుధారాణి, ఉమ పాల్గొన్నారు.

మేడిపెల్లి మండలం కట్లకుంటలో..

మేడిపెల్లి: మండలంలోని కట్లకుంట గ్రామంలో మంగళవారం సర్పంచ్ గడ్డం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ నారాయణరెడ్డి, ఎంపీటీసీ పన్నాల లావణ్య, శోభ, శంకర్, తిరుమల్, రవి పాల్గొన్నారు.

బీర్‌పూర్ మండలం రేకులపల్లిలో..

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు రేవతి, సుమలత, కార్యదర్శి రాణి పాల్గొన్నారు.

పాఠశాలలో ఫేర్‌వెల్ డే

మల్లాపూర్: ఎస్సెస్సీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ భూక్య గోవింద్ నాయక్ సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని సిరిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మోడల్ స్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ పి.రాజేందర్, వైస్‌చైర్మన్ స్వరూప పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

సారంగాపూర్: ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఏటా ఒక కుటుంబంలో ఒకరికి రూ.5లక్షల వరకు ఆరోగ్య ఖర్చులు అందుతాయని బీజేపీ బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి అన్నారు. ఈ మేరకు మంగళవారం బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు మ్యాడ జనార్దన్, ప్రధాన కార్యదర్శులు రమేశ్, జలేందర్ పాల్గొన్నారు.

యూఎస్‌పీసీ 'చలో హైదరాబాద్'


ప్లకార్డులతో యూఎస్‌పీసీ నాయకులు

జగిత్యాలటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నాకు జగిత్యాల యూఎస్‌పీసీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ రంగ సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాకు తరలివెళ్తున్నామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు బోగ రమేశ్, ఎన్నం రాంరెడ్డి, అంబటి భూమేశ్వర్, కొక్కుల రాంచంద్రం, తులసి ఆగమయ్య, దామోదర్‌రెడ్డి, రాములు, పరశురాం తెలిపారు.

అయోధ్య రామయ్య.. ఉప్పుమడుగు సీతమ్మ


కల్యాణానికి ముస్తాబైన ఆలయం


ఆలయంలోని ఉత్సవమూర్తులు

- ఐక్యత చాటుతున్న రెండు గ్రామాలు
- 30న సీతారామ కల్యాణ మహోత్సవం

రాయికల్: మండలంలోని అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాలు 36 ఏళ్లుగా శ్రీరామనవమి ఉత్సవాలు ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. 1987లో ఇరుగ్రామాల ప్రజలు గ్రామంలో శ్రీకోదండరామాలయాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఆలయ కమిటీలో ఇరుగ్రామాల ప్రజలు పాల్గొని శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అయోధ్య నుంచి రామయ్యని, ఉప్పుమడుగు నుంచి సీతమ్మ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి నవమి రోజు కల్యాణం నిర్వహించి ఇరుగ్రామాల ప్రజలు ఐక్యత చాటుతున్నారు. కల్యాణానికి ప్రభుత్వం నుంచి తహసీల్దార్ దంపతులు ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తారు. కాగా 30న అయోధ్య గ్రామంలో గురువారం సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం అర్చకులు అంగడి భువనేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. రాయికల్, జగిత్యాల, మేడిపల్లి, మండలాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ ఎడ్మల జీవన్‌రెడ్డి, కైరం ముత్తయ్య ఏర్పాట్లు చేశారు.

మైనార్టీ కార్పొరేషన్ యూనిట్లకు లబ్ధిదారుల ఎంపిక


కథలాపూర్‌లో లబ్ధిదారుల ఎంపిక

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు మంగళవారం లబ్ధిదారుల ఎంపిక నిర్వహించారు. దరఖాస్తుదారుల వివరాలతో లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 71 మంది దరఖాస్తు చేసుకోగా.. కేటగిరీ-1లో ఎం.డీ వాసీం, నఫీస్ సుల్తానా, కేటగిరీ-2లో ఎం.డీ మజీద్‌ను డ్రా పద్ధతిలో ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల : రాజమౌళేశ్ - 9392460005
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా :
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com